




తెలుగు కథ శత వార్షికోత్సవాల సందర్భంగా 'కౌముది' పాఠకులకి

ప్రముఖ రచయిత కలం నుంచి నెలనెలా ప్రత్యేక వ్యాస పరంపర

## కథా శబ్దలోక శిల్పి చాసో

(1915 - 1994)



**చాగంటి సోమయాజులు** (17.1.1915 - 2.1.1994) కథా ప్రపంచంలో చాసోగా ప్రసిద్ధులు. ఆయన రాసిన కథలు యాభైకి ఇటో, అటో. అయితే తాను అనుకున్నట్లు కథ రూపుదిద్దుకోకపోతే, ఏవేవి పక్కన పడేశారో వాటి వివరాలు మనకు తెలియవు. 'ఎందుకు పారేస్తాను నాన్నా' అనే కథను పూర్తిచెయ్యడానికి మూడేళ్ళు పట్టిందట. నాలుగైదుసార్లు తిరగరాసి, చింపేసి, ఆఖరుకు ఇప్పుడు మనం చదువుకునే రూపంలో ఈ కథ తీర్చిదిద్దారు. దీనివల్ల చాసో రచనా తత్వం కొంత మనకు తెలియవచ్చు. కథా రచనలోని అన్ని అంశాల మధ్య పొందిక సాధించాలనుకోవడం ఆయన సృజన స్వభావం. కథకు సంబంధించిన అతి చిన్న విషయాన్ని కూడా వదలకపోవడం ఆయన మనోధర్మం.

చాసో దిగువ మధ్య తరగతి, కింది తరగతి జీవిత సమస్యల్ని కథా వస్తువులుగా తీసుకున్నారు. కథా వస్తువుల ఎంపికలో, కథాంశాలు అంటే కథలకు కేంద్రపరిగణనలో సామాజిక సంవేదనతో కూడిన ప్రగతిశీల ప్రాంతీయ సామాజిక వైలక్షణ్యాలూ, వారి వారి సంభాషణా, శైలులూ, వర్ణనలూ, కథనమూ - వీటి మధ్య ఒక సంయోగాన్ని సాధించారు. నిర్మాణ సౌష్టవంతో కూడిన కథలను రాశారు. అలవోకగా రాసినట్లు అనిపిస్తాయి. విశ్లేషిస్తే అట్లా కథలు రాయడం సులభం కాదనే రచనా స్పృహను చాసో కథలు కలిపిస్తాయి. ఒక మంచి ఖండకావ్యం చదివినప్పుడు కలిగే ఏకోన్ముఖమైన అనుభూతిని చాసో ప్రతి కథా ఇస్తుంది.

చాసోకు ప్రకృతి అన్నా, పసిపిల్లలన్నా, మనుషుల మధ్య ఆపేక్షలన్నా చాలా ఇష్టం. ఆయన భరించలేనిదీ, కథల్లో విమర్శించినదీ దారిద్ర్యం, పీడన, వంచన, మిథ్యా విలువలలో ఉండే మెట్ట వేదాంతమూ, డబ్బు చేసే కీడూ, జీవితంలో మనుషుల దిగజారుడుతనమూ, మానవత్వ పతనమూ.

'బబ్బబ్బా', మొండెంకడు,' 'ఎందుకు పారేస్తాను నాన్నా', 'రథయాత్ర' 'చిన్నాజీ' అనేవి చిన్నపిల్లలను గురించి రాసిన కథలు. కుటుంబ జీవితంలో భాగంగా చిత్రించిన కథలు ఇవి. పిల్లల ఆటపాటల్నీ, మనస్తత్వాల్నీ, చురుకుదనాన్నీ, అమాయకత్వాన్నీ, బుద్ధి నైశిత్యాన్నీ, పరిశీలనా శక్తినీ ఈ కథలు పట్టిచూపుతాయి. చింతా దీక్షితులూ, కొడవటి గంటి కుటుంబరావు లాగా బాల్యాన్నీ, బాల్య

సమస్యల్నీ చాసో ఆర్ధ్రతతో చిత్రించారు. ఈ కథల్లో పన్నెండేండ్ల కృష్ణుడు ప్రధాన పాత్ర. వాడికి చదువంటే చాలా ఇష్టం. తండ్రిది ఆర్థిక నిస్సహాయతతో కూడిన ఘర్షణ. కొడుకు చదువుకోసం చుట్టలు మానేసి, తలతాకట్టు పెట్టైనా బళ్ళో వేస్తానని తండ్రి నిర్ణయం. పావలా చుట్టలు తెచ్చిపెట్టమని కొడుకుకు పని చెప్పడంలో మొదలైన కథ, తండ్రి కొడుకు చదువుకోసం చుట్టలు మానేయాలనుకోవడంతో ముగుస్తుంది. మధ్యలో పసివాడైన కృష్ణుడి విద్యాతృష్ణతో ముడిపడిన సన్నివేశాలూ, ఆ పసివాడి వేదనా మనల్ని ఉక్కిరి బిక్కిరి చేస్తాయి.

ఎంత ప్రేమించే భర్త ఉన్నా, దిగువ మధ్య తరగతి ఆర్థిక దుస్థితీ, ఆ జీవితంలోని ఆడజన్మా ఏ సున్నితమైన, ఆనందదాయకమైన కళాసక్తితో వీలు కల్పించలేదనే జీవిత సత్యాన్ని నిరూపించే కథ వాయులీనం. ఈ కథలోని రాజ్యానికి సంగీతమంటే ఇష్టం. పెళ్ళికి ముందే సంగీత సాధన చేసింది. ఫిడేలు మీద ఆ సాధన సాగింది. పెళ్ళితో, ఆ వెంటనే వచ్చిన వేవిళ్ళతో సంగీతం మూలపడింది. ముగ్గురు పిల్లలు కలిగారు. ఆ తర్వాత ఆమె టైఫాయిడ్‌కు గురి అయింది. భర్తకు డబ్బు ఇబ్బందులు. టైఫాయిడ్ మళ్ళీ తిరగబడింది. భర్త, భార్య ఫిడేల్ అమ్మి అనుకున్న దనికన్నా ఎక్కువ డబ్బు రావడంతో భార్యకు జరీ అంచు చీర కొంటాడు. క్షమించమని అడుగుతూ చీరెను రాజ్యానికి కప్పుతాడు. ఆమెకు కావలసింది ఒక జ్ఞాపకాన్నిమాత్రమే మిగిల్చింది. ఈ కథలోని మనస్థితీ, వాతావరణమూ విషాదాన్ని కలిగిస్తాయి. కళాసంస్కారానికి తావులేని ఆర్థికం పట్ల ఆలోచనలు కలుగుతాయి.

'ఏలూరెళ్ళాలి' అనే కథా వస్తువును చాసోకాక మరెవరు తీసుకుని కథరాసినా, అదొక సరస కథ అయితేలిపోయేది. ఈ కథ అర్ధరాత్రి రైలు పెట్టెలో జరుగుతుంది. పదిహేను సంవత్సరాల కథా కాలంలోని ఇద్దరి జీవితాల్లో, ముఖ్యంగా ఒక స్త్రీ జీవితం తిరిగిన మలుపులను ఈ కథ చిత్రించింది. పురుషోత్తం పద్దెనిమిదేళ్ళ యువకుడిగా, కాలేజీలో ఉన్నాడు. రెండింతలు వయసుండే మాణిక్యమ్మ - అరవైయేళ్ళ ఒక ఆడిటర్ రెండో భార్య - పురుషోత్తాన్ని కామించింది. బిడ్డను కంది. భర్త మరణించాడు. పురుషోత్తాన్ని రైల్లో కలుసుకున్నప్పుడు మాణిక్యం తన సంగతి చెబుతుంది. "నీ వరప్రసాదం ఉండబట్టి ఆయన గడించిన డబ్బు, పిత్రార్జితం, దాఖలు పడ్డాయి. లేకపోతే నా మరుదులు ముండను చేసి మూల కూచోబెడుదురు" అని అంటుంది. ఒక స్త్రీ ముసలి భర్త కారణంగా వ్యభిచారానికి పాల్పడి ఉండ వచ్చు. కానీ ఆమెలోని ఆపేక్షనూ, నిస్సహాయతనూ, జీవితాంతం గుర్తుంచుకునే ఆనందాన్నీ, చాసో చిత్రించిన తీరు సానుభూతిని కలిగిస్తాయి. నీతిబాహ్యం అనుకునే అంశానికి మూలాలు ఎక్కడున్నాయని ఆలోచింపచేస్తాయి.

'కుంకుడాకు','కుక్కుటేశ్వరం', 'బొండుమల్లెలు', 'ఎంపు' అనే కథలు మధ్య తరగతికి ఇంకా దిగువ ఉండే దరిద్రుల పీడనను గురించీ, ఆర్థిక రాజకీయాల గురించి రాసినవి.

కుంకుడాకులో పారమ్మ బుగత కూతురు. ఏం చేసినా చెల్లిపోతుంది. గవిరి కూలివాడి కూతురు. ఎనిమిదేళ్ళ పసి వయసులో పొయ్యిలోకి ఎండుకొమ్మల్నీ, ఎండూ ఆకుల్నీ తెచ్చుకోక తప్పని స్థితి. పారమ్మ, గవిరి మనస్తత్వాలకు కారణమైన సంపద, లేమి వీటిని చాసో నిపుణంగా చిత్రించారు. గవిరి దరిద్రుల పిల్ల కాబట్టే భుక్త దొంగతనం అంటగడతాడు. గవిరి కుంకుడాకు తట్టనూ, గవిరినీ తంతాడు. 'కుక్కుటేశ్వరం'లో దొంగ బియ్యం రవాణా చేస్తోందని ఒక ముసలమ్మను టీటీ పట్టుకుంటాడు. బాధిస్తాడు. ఆమె తనకు ఉరిశిక్ష వెయ్యమనీ, కుక్కుటేశ్వరుడికి ధూపం వెయ్యమనీ, రైలు ఉద్యోగులతో కడుపుమండి అంటుంది. 'బొండు మల్లెలు' శ్రమ దోపిడీకి గురై దిక్కులేని చావుచచ్చిన ఒక వృద్ధుని చిత్రణ. 'ఎంపులో' ముష్టి ముసలాడి కూతురు ఎర్రి, మరో కుంటి ముష్టివాణ్ణి పెళ్ళాడదామనుకుంటుంది. వాడి దగ్గర మూటెడు బియ్యం ఉన్నాయి. పైగా కాపోళ్ళ కుర్రాడు. ఎర్రి తండ్రి ఎర్రికి గుడ్డి వాణ్ణి తెస్తాడు. కుంటోడి మీది కంటే గుడ్డోడి సంబంధమే మంచిదని బోధిస్తాడు. గుడ్డోడు 'సూడరాదు' కాబట్టి. నీకు మనసయింది ఇష్టమొచ్చినట్టు తిరుగు' అని కూడా తత్వం చెబుతాడు. ఈ అధోజగత్తు తత్వం వల్ల ఒరిగేదేముంది? అనే ప్రశ్న సహజంగానే కలుగుతుంది. కానీ చాసో సమాజంలోని అన్ని వర్గాలనూ కలుషితం చేసిన ఒక పతన స్థితిని తెలిపి, షాక్ చేస్తున్నాడు. 'బండపాటు'లో బండలు గొట్టే, కార్మికుడి చావు మూలంగా ఏర్పడిన బండపాటు వంటి జీవితం రాజకీయాల చిత్రణను విమర్శనాత్మక వాస్తవికవాద దృక్పథం నుంచే చేశారు.

సామాజిక మానవుల తత్వాలకూ, సంబంధాలకూ, మంచిచెడ్డలకూ మూలభూతమైన అంశాలను గురించి ఆలోచింపచేశారు. ఏ జోక్యమూ లేకుండా ఏ ఆవేశాలు లేకుండా, ఏ రకమైన మమకారాలూ లేకుండా చాసో కథలను మల్చాడు. మెట్టవేదాంతాన్ని విమర్శించిన కథ 'కర్మసిద్ధాంతం'. ఈ కథలో చీకూ చింతాలేని పుల్లక్కకు, పేరక్క వేదాంతం బోధిస్తుంది. పేరక్క ప్రవర్తన వేరు, బోధలు వేరు. ఆమెకు ఉర్లాం పండితుడితో నీతి బాహ్యమైన సంబంధముంది. అయినా నోరు పెట్టుకుని బతికుంది. అమాయకులకు వేదాంతం చెబుతుంది. పుల్లమ్మకు నిజమైన వేదాంతం తన కోడలి ద్వారానే లభిస్తుంది. ఆమె అంటుంది 'దేముడు శిక్ష వేస్తున్నది అమాయకత్వాన్ని, తెలివి తక్కువతనాన్ని" అని.

'మొక్కుబడి' కథ మొక్కుబడులు అజ్ఞానం మీద వ్యంగ్యాస్త్రాన్ని సంధించిన కథ.

చాసో కథలు ఈ శతాబ్ది తెలుగు జీవితాన్ని చిత్రించినవి. తెలుగు నేలను స్పృశించనవి. కళింగాంధ్ర ప్రాంత సామాజిక జీవనాన్నీ, అక్కడి ప్రాదేశికతనూ, భాషనూ, యాసనూ, పలుకుబళ్ళనూ చిత్రించినవి. తెలుగు జీవితంలో భాగమైన తెలుగుదనం చాసో కథల్లో కొట్టొచ్చినట్లు కనిపిస్తుంది. 'బొమ్మలపెళ్ళి' అనే కథనే తీసుకుందాం. ఈ కథలో సంపన్నుల పిల్లలు గోచీలతో కనిపిస్తారు. ఐదు రూపాయల పన్ను కట్టలేక యాభై ఎకరాల ఆస్తిని వదులుకున్నవారు కనిపిస్తారు. నూరేళ్ళ జీవిత విధానంలో మలుపులు కనిపిస్తాయి. ముత్తవ్వ మునిమనుమలకు చెప్పిన ఈ కథలో నాటి పెళ్ళిళ్ళూ, అయిదోతనం లేని ఆడవాళ్ళ హీనమైన బతుకులూ ప్రస్తావనకు వస్తాయి. తెలుగు తనమున్న భారతీయ సామాజిక చిత్రణ ఇది. 'రథయాత్ర' కథలో కూడా దీన్ని మనం చూడవచ్చు. ఇటువంటి నేపథ్యం నుంచే చాసో ఇతివృత్తాలు పుట్టాయి. పాత్రలు ఉద్భవించాయి. జీవిత విశ్లేషణ పుట్టింది. సాంఘిక చైతన్యమూ జనించింది.

చాసో కథన చాతుర్యం విశిష్టమైంది. దాదాపు సగం కథలను చాసో ఉత్తమ పురుషలో రాశారు. ప్రథమ పురుష కథనంలో ఉండదు. ఉత్తమ పురుషలో రచయిత ఒక పాత్ర మనసులోకి మాత్రమే దూరగలడు. అది రచయిత స్వేచ్ఛకు పరిమితి. మరి చాసో తన కథల్లో చాలా వాటికి ఉత్తమ పురుష కథనాన్నే ఎందుకు గ్రహించినట్లు? ఉత్తమ పురుష కథనం ద్వారా సర్వసాధారణంగా రచయితలు సాధించే ఆత్మీయ లక్షణం కోసమా? సులభంగా ఉన్నట్లు అనిపింపచేయడానికా? 'వజ్రహస్తం', 'కప్ప', ఊళ్ళో వానలేదు,' 'బొండు మల్లెలు', 'బబ్బుబ్బు', 'ఆవిష్కరణ', దుమ్ముల గొండె', 'ప్రెసిడెంట్ లక్ష్మీకాంతం', 'ఊహ,' 'ఊర్వశి,' 'చిన్నాజీ', 'ఏలూరెళ్ళాలి' – ఈ కథలన్నీ ఉతమ పురుషలో రాసినవే. ఈ కథలో 'ఏలూరెళ్ళాలి' లాంటి కొన్ని కథలు సులభమైనవిగా కనిపించలేదని రాచమల్లు రామచంద్రారెడ్డి అంటారు. నేను అనే పాత్ర చాసో కథల్లో తన స్వీయానుభవాన్ని చాలా ఆషామాషిగా చెప్పినట్లు అనిపిస్తుందని కూడా రా.రా. అభిప్రాయపడ్డారు. "ఏలూరెళ్ళాలి" కథను ఉత్తమ పురుషలో చెబితే తప్ప అందులోని స్త్రీ పాత్రను గురించి పురుష పాత్ర ఆలోచనలు బయటికిరావు. 'దుమ్ముల గొండె' కూడా ఉత్తమ పురుషలోనే చెప్పాలి. లేకుంటే ఆ కథకు ప్రాణభూతమైన వాతావరణ చిత్రణలో భ్రాంతి రూపొందదు" అని చాసో వివరించారు. అంటే ఉతమ పురుష కథనశిల్పాన్నైనా, ప్రథమ పురుష కథన శిల్పాన్నైనా కథకుడికీ, కథలోని ఇతర పాత్రలకూ ఉండే సంబంధం ఒక అప్రయత్న పూర్వక సంబంధం నిర్ణయిస్తుందనుకోవాలి.

చాసో కథా శిల్పంలోని గడుసుదనమూ, ధ్వనీ కథారచనలో అనుసరణీయమైనవి. అభూత కల్పనలూ, హద్దుమీరిన ఆవేశాలూ కథకు సరిపోవని నిరూపించిన భావకుడైన బుద్ధిజీవుల రచయిత చాసో.